# శశికళ

## - రాంపా

**శశికళ నడకలో ఓ క్రమం ఉంది. ఆ క్రమంలో అందం వుంది. ఆ అందంలో ఆధునికత వుంది. అన్నిటికీ మించి బాధ్యత వుంది. తన నడక గురించి అంతలా చెప్పొచ్చనే సంగతి మాత్రం శశికళకు తెలియదు.**

ఆ సమయంలో ఆ మాట తప్పితే యింకోటి అనలేం అన్నంత స్థాయిలో మాట్లాడుతుంది తన పరిధుల్లోనే. ఏ పదంలో కూడా తడబాట్లు, తొట్రుపాట్లు వుండవు. ఆ మాటల్లో ఓ కళ వుంది. మాట్లాడడం ఓ కళ అన్న సంగతి మాత్రం శశికళకు తెలియదు.

ఏ చీర ఎలా కట్టినా బావుంటుంది. బాగుండా లని కట్టడం మాత్రం తెలియదు.

శశికళకు బాగా తెలిసిన విషయం ఒకటే! బాగా పనిచేయడం. తనకొచ్చిన పని అంట్లు తోమడం బట్టలుతకడం, యిల్లూడవడం, యిల్లు కడగడం, మంచిగా ముగ్గులు పెట్టడం. తను పనిచేసే పరిసరాల్లో ఎక్కడ అశుభ్రం అనిపించినా సహిం చలేక పోవడం. తనకు వాళ్లింట్లో , వీళ్లింట్లో పనిచేయకూడదు అని పరిమితుల్లేవు. శశికళకు యిద్దరన్నయ్యలు. యిద్దరూ రిక్షా నడువుతున్నారు. బతకడం తెలిసినవాళ్లు. యిద్దరక్కయ్యలు. వాళ్ల అందమే వాళ్లకు మంచి ఉద్యోగాలు చేస్తున్న భర్త లను తెచ్చిపెట్టింది. అక్కయ్యలతో పాటు తనకూ ఒకటి రెండు అక్షరం ముక్కలు అబ్బాయి. 'అచ్చరాలు' అనదు అక్షరాలు అనే అంటుంది.

అక్కయ్యలంత అందం లేకపోయినా ఓ ప్రత్యేక మైన ఆకర్షణ వుంది. తను ఆశించిన పెళ్ళికొడుకు దొరకలేదన్న బెంగ శశికళ మొహంలో ఎవరూ అనువదించుకోలేరు!

నిద్ర చూస్తే వళ్లు తెలియకుండా వుంది. లేపి తేనేమో కోపం. యిటువంటి వాళ్లు లుంగీలు కట్టుకోవడం ఎందుకో! అని ఓ యింట్లో ఓ భార్య భర్త మీద విసుక్కుపడుతుంటే...

"మంచం కిందే కదండీ అమ్మగారు నేను ఊడవడం దానికోసం అయ్యగార్ని కదిలించడం ఎందుకులెండి" అని ఆ ఇల్లాలికి సర్దిచెప్పే గుణం వుంది శశికళలో.

ఓ గదిలో వుండి చదువుకునే పిల్లలకి అన్ని పనులు చేయడమే కాదు అన్నం కూడా వండిపెడు తున్న తను ఆ పిల్లల వికృత చేష్టలను చూపులను నవరించి చదువుపై మనసు కేంద్రీకృతమయ్యేట్లు చేసే మౌనం వుంది తనలో. తప్పు చేసిన ఎదుటివారిని తన మౌనంతోనే తల వంచుకునేట్లు చేయగలదు. తల ఎత్తుకుని తిరిగేట్లూ చేయగలదు.

ఓ భర్త వేధింపును భరించలేక జీవితం చాలించ వూనుకున్న ఓ అభాగ్యురాలైన యిల్లాలితో "నిజంగా మనకు చావొస్తే ఏ శక్తీ ఆపలేదు. వచ్చే చావు వచ్చేదే. మనకై మనం చావును కొని తెచ్చుకోవడం ఎందుకు. చచ్చిందాకా మనం జీవించే వుండాలి. అనుభవాలు కుప్పలు కుప్పలు రాసులు పోసుకుం టూనే వుండాలి" అని తనకు తోచిన విధంగా ధైర్యం చెప్పే సాదరణా వుంది శశికళలో.

పరాయి మగాళ్లతో సుఖాలు వెతికే ఓ యిల్లాలు తన అంగాగాన్నీ మెచ్చుకుంటూ ముచ్చట పక్క దారి పట్టించడానికి ప్రయత్నించినప్పుడు సరైన రీతిలో బుద్ధి చెప్పే నైజమూ వుంది శశికళలో.

గొడ్డు చాకిరీ చేసే శశికళ వయసుకు " ఏ కోరికలు లేవా?" అని అడిగే చనువు ఎవరికీ లేదు ఒక్క శశికళకు తప్పితే.

అయితే శశికళ అడగదు. ఎందుకంటే తన జీవితానికో లక్ష్యం వుంది. అదేంటంటే తను ఓ స్థిరమైన ఉద్యోగికి భార్య కావాలి. తనకు పుట్టే పిల్లలు మంచిగా చదువుకుని రాబోయే తనతరం పనిచేయడాన్ని ప్రేమించేవాళ్లు కావాలి గాని తనలాగా పనిమనుషులు కాకూడదు అని.

* * * * *

తన కష్ట ఫలాల్ని జమచేసే బ్యాంకుకి ఎప్పుడు వెళ్లినా ఆప్యాయంగా పలకరించి ఒక్కోసారి బలవం తంగా టీ తాగి పో అని మర్యాదలు కూడా చేసే ఓ ఉద్యోగిని ఓరోజు శశికళను వాళ్ల యింటికి తీసికెళ్లింది. మంచితనాన్నీ కష్టపడే గుణాన్నీ ఎంతో గౌరవించే వాళ్ల నాన్నగారు ఓ రచయితని ఆయనకు శశికళను చూడాలని వుందని చెప్పారని తీసికెళ్లింది.

* * * * *

"అయ్యగారూ! నేను కష్టపడి సంపాయించే డబ్బు నా పెళ్లికి నేను యిచ్చుకోవాల్సి వచ్చే కట్నం. పెళ్లికయ్యే ఖర్చు" అని చెప్పింది శశికళ.

నివ్వెరబోయాడు రచయిత!

తన అనుభవంలో యిప్పటిదాకా తారసపడని వ్యక్తిత్వంగా శశికళ ఒక్క మాటలో గోచరించింది రచయిత గారికి!



శశికళను అభినందించడానికి ఏమాత్రం సంకోచించకుండా 'నువ్వు చాలా గొప్పదానివి శశికళా' అన్నాడు రచయిత.

ఇందులో గొప్పతనం ఏముంది అయ్యగారు. నా వల్ల పదిమంది జీవితాలేం బాగుపడడం లేదుగా. నా భవిష్యత్తు మంచిగా వుండాలని కోరుకుంటున్నాను. నా స్వార్థం నేను చూసుకుంటున్నాను. నా కోసమే నేను కష్టపడుతున్నాను' అంది శశికళ.

'ఎవర్నీ ఎవ్వరూ ఒక్క పైసా ఆదనంగా అడగలేదు గదా. యివ్వబోయినా తీసుకోలేదుగదా' అన్నాడు రచయిత. శశికళ ఔన్నత్యాన్ని తన కూతురు మాటల్లో విన్న అనుభవాన్ని మననం చేసుకుంటూ..

'నేను పనిమనిషిని. బిచ్చవుదాన్ని కాదు.' అని చెప్పింది శశికళ.

'నీకు మంచి సంబంధం చూసే బాధ్యత నాది' అన్నాడు రచయిత.

తనలో ఓ తండ్రిని చూస్తున్న శశికళ కళ్లను చూసిన రచయిత కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఆ నీళ్లు కొంచెం ఎక్కువై కారడానికి కారణం భర్త వంచనకు తిరస్కారానికి బలైన తన కూతురు అక్కడే వుండడం!

* * * * *

"అమ్మా శశికళా! సంబంధం మంచిదే. పిల్లవాడి కుటుంబం నాకు తెలిసిందే. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. అబ్బాయి కష్టపడి రెండు మూడు పరీక్షలు పాసైతే మంచి ప్రమోషన్ కూడా అందుకోవచ్చు. నల్లగా వుంటాడు. కట్నం గిట్నం ఏం వద్దంటున్నాడు" చెప్పాడు రచయిత.

'రంగు గురించి నేనెవ్వడన్నా అభ్యంతరం చెప్పానా అయ్యగారూ' అంది శశికళ.

గట్టిగా చేసుకో అని చెప్పడానికి ఒకే ఒక్క విషయంలో నేను వెనకాడుతున్నాను' అన్నాడు రచయిత నిట్టూరుస్తూ.

'ఎన్నో తెలిసిన మిమ్మల్ని యిబ్బంది పెడుతున్న ఆ సంగతేంటయ్యగారు' అడిగింది శశికళ.

"అబ్బాయి కాలు అవిటి కుంటివాడనే చెప్పాలి." చెప్పాడు రచయిత చూపులు పక్కకు మళ్లించి.

'అన్నీ బాగుండి ఆదొక్కటే లోపమైనప్పుడు అది నేను లోపమని అనుకోను లెండి' అంది శశికళ.

తన జీవిత ఆశయం నెరవేరబోతున్న ఆనందం స్పష్టంగా కనబడుతున్నది శశికళలో. బయటకు తెలిసేంత ఆనందం మంచిది కాదని తెలుసుకుందేమో అన్నట్లు నిభాయించుకోవడమూ కనిపించింది శశికళలో

* * * * *

శశికళ పెళ్లయి చాలా రోజులయింది.

శశికళలో కళ పోయింది!

శశికి మసి పట్టింది!

* * * * *

శశికళ అన్నయ్యలూ అక్కయ్యలూ బావలూ అందరూ ఆలోచనలేని ఆలోచన తెచ్చిన నిశ్శబ్దంలో, కళ్లుండి ఏం చూస్తున్నారో రచయితా ఆయన కూతురూ ఆదుర్దాగా వచ్చారు.

పెల్లుబికి వచ్చిన ఏడుపును ఆపుకోలేకపోయింది శశికళ.

'మా ఆయన కాలేకాదు. మనసు కూడా అవిటిదండీ అయ్యగారూ. నన్ను బాగా అనుమానిస్తున్నారు. వళ్లంతా వాతలు పెట్టాడు. కొట్టాడు. అతనికి అంతకు ముందే ఎవరితోనో పెళ్లయింది' అని ఏదో చెప్పబోతూ కళ్లు తిరిగి కిందపడిపోతున్న శశికళను తన ఒడిలోకి తీసుకుంది రచయిత కూతురు.




స్త్రీల టానిక్
లోధ్ర
బాధారహిత ఆరోగ్యమును స్త్రీలకు 97 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.
స్త్రీలకు కలుగు అకాల బహిస్టు, ముట్టుకుట్టు, బిుతురక్తం ఎక్కువ తక్కువగా పోవుట, నడుము నొప్పి, సంతానహీనత, గర్భకాలపు జబ్బులకు
ఉచిత వైద్య సలహా కొరకై ఈ ప్రక్క చిరునామాతో సంప్రదించండి

తయారుచేయువారు :
కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు - 600 014.
ఏజంట్లు: సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్, P.B.No: 136 విజయవాడ - 1 సికింద్రాబాద్